క్లుప్తంగా

ఎస్‌హెచ్‌ఓగా రఘు



నర్సంపేట రూరల్ : నర్సంపేట పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా సీఐ లేతకుల రఘు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన రమణమూర్తి బదిలీపై వరంగల్‌లోని సీసీఎస్‌కు వెళ్లగా, సీసీఎస్‌లో విధులు నిర్వహించిన రఘు ఇక్కడికి బదిలీపై వచ్చారు. విధుల్లో చేరిన సందర్భంగా ఆయనకు పోలీసు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

టీహెచ్‌ఆర్ అనుమతి అభినందనీయం

నర్సంపేట: అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెల సెలవు దినాలు ప్రకటించి, టీహెచ్‌ఆర్ ఇవ్వడానికి అనుమతిచ్చిన మహిళాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (బీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మహిళా శిశు అభివృద్ధి శాఖ కార్యాలయంలో బుధవారం కమిషనర్ కాంతి వెస్లీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎండలతో కేంద్రాలకు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రావడం లేదని యూనియన్ల విజ్ఞప్తి మేరకు సెలవులు ప్రకటించడంతో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు, రాష్ట్ర, జిల్లా, ప్రాజెక్టు కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు హర్షం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (బీఆర్‌టీయూ) వి.రమాతార, కోశాధికారి ఎం.వేదవతి పాల్గొన్నారు.

నిరసన



నర్సంపేట : జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జాతీయ అవార్డు గ్రహీత గోకా రామస్వామి అధ్యక్షతన బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక వేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడారు. దాడి అమానుషమన్నారు. దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు బిజ్జంకి ప్రభాకర్, భారతి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు డాక్టర్ ఆడెపు రాజేంద్ర ప్రసాద్, వారనాసి మోహన్, ఆరోగ్యమిత్ర, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ధర్నా

వర్ధన్నపేట : మండలంలోని శ్రీరామోజీ కుమ్మరిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని కోరుతూ గ్రామస్తులు, రైతులు స్థానిక ప్రధాన రహదారిపై బుధవారం ధర్నా చేశారు. గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో తాము వేరే గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు ధాన్యం తడిచి నష్టం జరుగుతోందని వాపోయారు. ఇకనైనా అధికారులు, ప్రభుత్వం గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

'దర్గా సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి'

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలోని దర్గా వద్ద మహిళపై చేయి చేసుకున్న దర్గా సూపరింటెండెంట్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ మండల ఇన్‌చార్జ్ గారె జయరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జయరాజ్ మాట్లాడారు. దర్గా వద్ద రాత్రిపూట నిద్రిస్తున్న మతిస్థిమితం లేని మహిళపై సూపరింటెండెంట్ దాడి చేయడం హేయమన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

వర్ధన్నపేట : మండలంలోని బావనికుంట తండాకు చెందిన నూనావత్ బిక్కు సాకుతున్న మేకపోతు మేతకు వెళ్లిన క్రమంలో సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ స్తంభానికి ఉన్న ఎర్త్ తీగకు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఎర్త్ వైరును రక్షిత ప్రదేశంలో ఏర్పాటు చేయకపోవడం వల్లే మేక మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. మనుషులకు ఎర్త్ వైరు తగిలితే ఎలా? అంటూ గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఒకరిపై కేసు నమోదు

ఐనవోలు : పోలీసులను దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ బుధవారం తెలిపారు. మండలంలోని పంథిని గ్రామానికి చెందిన చిర్ర శ్రీనివాస్ 100 డయల్ చేసి బండి రవితో గొడవ జరుగుతుందని పోలీసుల సహాయం కావాలని కోరాడు. పెట్రోలింగ్ వాహనంలో పంథినికి వెళ్లిన కానిస్టేబుల్ గొడవకు కారణం అడుగుతున్న క్రమంలో బండి రవి ఇష్టానురీతిగా పోలీసులను దుర్భాషలాడినట్లు తెలిపారు. బుధవారం ఉదయం రవిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సెస్సీలో ప్రభుత్వ పాఠశాలల హవా

సాక్షి నెట్‌వర్క్ : పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల హవా కొనసాగింది. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని సీహెచ్.శ్రావణి 553 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించింది. నర్సంపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి షర్వాణి 553, ఇటుకాలపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి నిఖిత 530, గురిజాల హైస్కూల్ విద్యార్థి బండారి స్పందన 529, సంజన 529 మార్కులు సాధించారు. చెన్నారావుపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థి బోడ కార్తీక్ 536, కేజీబీవీ విద్యార్థులు ఎం.అనూష 521, జి.వర్షిక 517, వి.వైష్ణవి 506, డి.స్వాతి 503 మార్కులు సాధించారు. ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఊట్ల చైతన్య 529, బి.శ్రీజ 504, వెలిదె ఆకాష్ 500 మార్కులు సాధించారు. అమీనాబాద్ మోడల్ స్కూల్ విద్యార్థులు కార్తీక్ 536 మార్కులు, పడాల శివకుమార్ 535, వినయ్ 516 మార్కులు సాధించారు. దుగ్గొండి మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి గుజ్జుల సాయితేజు 538, కేజీబీవీ విద్యార్థి కాటబత్తిని నవ్య 532, నాచినపల్లి హైస్కూల్ విద్యార్థి బోళ్ల వైష్ణవి 524 మార్కులు సాధించారు. పర్వతగిరి మండలంలోని పీఎం శ్రీ టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్/జెసి(జి) విద్యార్థులు కాసం ఝాన్సీ 567, పోషల కీర్తన 558, ఆంగోతు మానస 555, ఒరుగంటి సౌమ్యశ్రీ 542, టెడ్డి పల్లవి 542, గడ్డం నిత్యశ్రీ 524 మార్కులు సాధించారు. మోత్యతండాకు చెందిన భానోతు చరణ్ 518 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. రాయపర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి మర్రి రక్షిత 562, మైలారం హైస్కూల్ విద్యార్థి బి.సుష్మిత 539, గిరగాని సంజన 530, అబ్బోజు కార్తిక 527, బొబ్బల వర్షిత్‌రెడ్డి 527 మార్కులు సాధించారు. స్థానిక తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు జి.వైశాలి 546, జి.విష్ణవి 541, పి.వైష్ణవి 540, బి.సనశ్రీ 535, డి.వర్షిణితేజ 533, కే.వైష్ణవి 528 మార్కులు సాధించారు. సంగెం మండలంలోని ఎంజేపీ విద్యార్థులు సిద్ధార్థ 558, అప్పని సాయి వరుణ్ 549, మొండ్రాయి హైస్కూల్ విద్యార్థి దీపిక 542 , కేజీబీవీ విద్యార్థి రక్షిత 541 సాధించారు. గీసుకొండ మండలంలోని కేజీబీవీ విద్యార్థి అక్షయ 546, గంగదేవిపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి రక్షిత 544 మార్కులు సాధించారు. నెక్కొండ టీజీఆర్ఎస్ (బాలికల) విద్యార్థులు హాసిని 577, నేహా 574, సూరిపల్లి హైస్కూల్ విద్యార్థి జీవన్‌పాల్ 513 మార్కులు సాధించినట్లు తెలిపారు. నల్లబెల్లి మండలంలో 354 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 338 మంది ఉత్తీర్ణత సాధించారు. ఖానాపురం మండలానికి చెందిన వినయ్ 535, నిమ్మ భవిక 524, కీర్తన 500, సన్ని శాంసన్ 443, మంగళవారిపేటకు చెందిన శృతి 477, ధర్మరావుపేటకు చెందిన అఖిల్ 466, కొత్తూరుకు చెందిన హాసిని 508, మనుబోతులగడ్డకు చెందిన ప్రసన్న 523, కేజీబీవీ విద్యార్థి అస్మిత 531, టీఎస్ఎంఎస్ విద్యార్థి సిద్ధు 509 మార్కులు సాధించారు.



మర్రి రక్షిత (562) శ్రావణి (553) సాయిచరణ్ (549) కే.అక్షయ (546) జి.వైశాలి (546)
ఎం.రక్షిత (544) దీపిక (542) రక్షిత (541) జి.వైష్ణవి (541) పి.వైష్ణవి (540) పూజిత (538)
సమీన (538) సాయితేజు (538) సింధుప్రియ (537) కార్తీక్ (536) శివకుమార్ (535) బి.సనశ్రీ (535)

ముగిసిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- మండలంలో 97 శాతం పూర్తి
- ఎల్–1 దరఖాస్తుల సంఖ్య 5,505

నల్లబెల్లి : సొంతింటి కల నెరవేరుతుందని ఎదురుచూస్తున్న ప్రజాపాలన దరఖాస్తుదారులకు ఇందిరమ ఇళ్లు మంజూరు కావడం గగనంగా మారనుంది. దరఖాస్తులు వేలల్లో ఉండడం.. మంజూరు వందల్లో ఉండడంతో మొదటి విడత అదృష్టం ఎవరిని వరిస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలస్థాయి అధికారులు పరిశీలిస్తున్నారు. అనర్హులను జాబితాల నుంచి తొలగిస్తూ.. ఆ స్థానంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల సూచనల మేరకు అర్హులను గుర్తిస్తున్నారు. మండల కేంద్రం మినహాయించి మిగిలిన 27 గ్రామ పంచాయతీల్లో పూర్తి కావడంతో గ్రామాల్లో ఉత్కంఠ రేపుతోంది.

దరఖాస్తులు ఎక్కువ..

దరఖాస్తులు ఎక్కువగా రావడం.. ఇళ్ల కేటాయింపు పరిమితికి లోబడి ఉండడం సమస్యగా మారింది. ఇటీవల రాంతీర్థంలో అర్హులందరికీ అధికారులు ఇళ్లు కేటాయించారు. కానీ, మండలంలో మిగిలిన గ్రామాల్లో ఆ పరిస్థితి కనిపించడంలేదు. ఆయా గ్రామ పంచాయతీల్లో 36,959 మంది జనాభా నివసిస్తుండగా ఎల్–1లో 5,505 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా, నర్సంపేట నియోజకవర్గానికి ప్రభుత్వం 3,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించింది. జనాభా ప్రాతిపదికన ఇందిరమ్మ కమిటీలు ఆయా గ్రామాలకు 395 ఇళ్లను కేటాయించాయి. కనీసం మరో 100 ఇళ్లు కేటాయిస్తే నిరుపేదల సొంతింటి కల నెరవేరే అవకాశముందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రాంరెడ్డి(ఫైల్)

సర్వే పూర్తి చేస్తున్నాం..



నల్లబెల్లి మండలంలోని రాంతీర్థం గ్రామంలో అర్హులైన 33 మందికి ప్రభుత్వం ఇటీవల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. నిర్మాణ పనులు వివిధ దశలో ఉన్నాయి. మిగిలిన 28 గ్రామ పంచాయితీలకు ఇందిరమ్మ కమిటీ ప్రతినిధుల ప్రతిపాదనల మేరకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి 395 మందికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారు. ఈ కేటాయింపులపై ఉన్నతాధికారులు సర్వే చేసి తుది జాబితా ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు మండలస్థాయి అధికారులతో సర్వే చేపట్టారు. మండల కేంద్రం మినహాయించి మిగిలిన గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. ఎమ్మెల్యే ప్రతిపాదన మేరకు త్వరలోనే 395 మందికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనుంది.

– నర్సింహమూర్తి, ఎంపీడీఓ, నల్లబెల్లి

పేదలకు 'ఇందిరమ్మ'లో ప్రాధాన్యం ఇవ్వాలి

ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్

నర్సంపేట : ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం రమేశ్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకత లోపించిందని చెప్పారు. పేదలను విస్మరించి ఇష్టారీతిన లబ్ధిదారులను ఎంపిక చేశారని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పేదలకు ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. అలాగే పేదలు నివాసిస్తున్న కాలనీల్లో వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, యూపీఎస్ఎం రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, నాయకులు ముప్పారపు రాజేందర్, బైరబోయిన నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉచిత వైద్యశిబిరం



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రాజగోపాల్

సంగెం : మండలంలోని రామచంద్రాపురంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో మాధవ హాస్పిటల్ నిర్వాహకుడు డాక్టర్ రాజగోపాల్ సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చని ఆయన తెలిపారు. సుమారు 150 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొంపల్లి దిలీప్‌రావు, జక్క మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే పాదయాత్ర ధ్యేయం

పర్వతగిరి : రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా అధిష్ఠానం ఆదేశాల మేరకు మండలంలో ‘జై బాపు, జై భీమ్, జై సంవిధాన్’ పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు తెలిపారు. మండలంలోని తురకల సోమారం, జమాలాపురం, గోరుగుట్టతండా గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా గిరిజనుల ఇళ్లలో రేషన్ షాపుల నుంచి సన్నబియ్యం పొందిన లబ్ధిదారుల ఇళ్లలో నాయకులు భోజనం చేసి బియ్యం నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాస్, దేవేందర్‌రావు మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే అన్ని వర్గాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ తుపాకుల సంతోశ్, పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు జున్ను కనకయ్య, వాగ్యనాయక్, మహిళా అధ్యక్షురాలు సువర్ణ, ఎస్సీ సెల్ కన్వీనర్ నరుకుడు రవీందర్, ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు చల్ల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



సన్నబియ్యం లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేస్తున్న శ్రీనివాస్, నాయకులు

అవగాహనతో సైబర్ నేరాలకు చెక్

- ఎస్సై చందర్

వర్ధన్నపేట : అవగాహన కలిగి ఉండడం ద్వారా సైబర్ నేరాలకు చెక్ పెట్టొచ్చని స్థానిక ఎస్సై చందర్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు ఆయన సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంచుకోవాలని సూచించారు. లాటరీ తగిలిందని, ఇతర ప్రలోభాలకు గురి చేసేలా అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దని చెప్పారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీని ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పలు రకాలుగా మోసాలకు పాల్పడుతున్న క్రమంలో ప్రజలు చైతన్యవంతం కావలని సూచించారు. మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎస్సై చందర్

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తెకు గాయాలు

నల్లబెల్లి: రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తెకు గాయాలైన ఘటన శనిగరం క్రాస్‌రోడ్డులోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మూడుచెక్కలపల్లి గ్రామానికి చెందిన భూక్యా రమేశ్ తన భార్య, పిలల్లతో కలిసి నర్సంపేట వైపు నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో శనిగరం క్రాస్‌రోడ్డులోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో రమేశ్‌తోపాటు ఆయన రెండేళ్ల కుమార్తెకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై గోవర్ధన్ ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన ఇద్దరిని పోలీసు వాహనంలో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ఎస్సై వెంట కానిస్టేబుళ్లు శ్రావణ్‌కుమార్, రేవంత్‌కుమార్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



నర్సంపేట : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామానంద్

నర్సంపేట : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ తెలిపారు. పట్టణంలో విఘ్నేశ్వర రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను పొందాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాజీ ఎర్ర యాకూబ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అజ్మీర మేఘ్యానాయక్, రైతు సంఘం అధ్యక్షుడు చిలువేరు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి రేమిడి శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి రాజా మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని అలంకానిపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రెడ్లవాడ పీఏసీఎస్ చైర్మన్ జలగం సంపత్‌రావుతో కలిసి స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం హరీశ్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు లబ్ధి చేకూర్చేలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, నాయకులు ఆవుల శ్రీనివాస్, ఈదునూరి సాయికృష్ణ, రాంపెల్లి శ్రావణ్‌కుమార్, గాజుల కృష్ణ, సముద్రాల మల్లయ్య, ఆకుల ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి కంఠమహేశ్వర స్వామి బోనాలు

- మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లిలో ఈనెల 9 నుంచి 13 వరకు శ్రీకంఠ మహేశ్వరం స్వామి బోనాలు నిర్వహిస్తామని మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్ తెలిపారు. ఆ గ్రామంలోని కంఠమహేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బోనాలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బొట్టు పెద్ద మనుషులు కట్ల సుధాకర్, బుర్ర వెంకటేశ్వర్లు, సంఘం అధ్యక్షుడు బుర్ర ఆనంద్, ఉపాధ్యక్షుడు బత్తిని అశోక్, కార్యదర్శి కక్కెర్ల కుమారస్వామి, కోశాధికారి తాళ్లపెల్లి అశోక్, నర్సంపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ మేర్గు శ్రీనివాస్, కమిటీ సభ్యులు కట్ల కనకయ్య, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రమేశ్, నాయకులు

'ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

ఖానాపురం : ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి గొంది నాగేశ్వర్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మంగళవారిపేటలో బుధవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవించాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. సమావేశంలో నాయకులు నర్సయ్య, ఉపేందర్, కిరణ్, శ్రీను, సంజీవ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లలిత కళల్లో శిక్షణ

వరంగల్ స్పోర్ట్స్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, భావ వ్యక్తీకరణను పెంపొందించేందుకు లలిత కళల్లో నేటి(గురువారం) నుంచి జూన్ 6 వరకు వేసవి ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా బాలభవన్ సూపరింటెండెంట్ ఝాన్సీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని బాల భవన్‌లో ప్రతీ రోజు ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు మృదంగం, నృత్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 5 నుంచి 16 ఏళ్ల వయస్సు గల బాలబాలికలు అర్హులుగా పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 99125 00516 మొబైల్ నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఇస్మాయిల్, నాయకులు

సంగెం : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం మండలంలోని షాపూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సందర్శించి ధాన్యాన్ని పరిశీలించి సమస్యలపై అధ్యయనం చేసింది. అనంతరం ఇస్మాయిల్ మాట్లాడారు. ప్రభుత్వం ఒక్కో కొనుగోలు కేంద్రానికి 30 చొప్పున టార్పాలిన్ షీట్లు కేటాయించినా ఒక్క రైతుకు కూడా ఇచ్చిన దాఖలాల్లేవని ఆందోళన వెలిబుచ్చారు. ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుండడంతో ధాన్యం తడుస్తోందని, రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇకనైనా అధికారులు స్పందించి టార్పాలిన్ షీట్లు, ఇతర వసతులు లభించేలా చూడాలని, ధాన్యం విక్రయించిన రైతులకు రోజు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కన్వీనర్ గోనె రాంచంద్రం, రౌతు శ్రీనివాస్, జక్క అశోక్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైన్‌కు మరమ్మతులు పూర్తి చేసిన దృశ్యం

దుగ్గొండి : మండలంలోని మహ్మదాపురం గ్రామంలోని బొడ్రాయి సెంటర్‌లో లీకేజీకి గురైన మిషన్ భగీరథ పైపులైన్‌కు అధికారులు బుధవారం మరమ్మతు చేయించారు. పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నీరంతా వృథా పోతున్న క్రమంలో 'మిషన్ భగీరథ నీరు వృథా' శీర్షికతో 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రిడ్ ఏఈ శిరీష సిబ్బందితో నేలపై ఉన్న పైపులైన్‌కు మరమ్మతులు నిబంధనల మేరకు కందకం తీయించి భూమి లోపల వేయించారు. ట్యాంక్‌లోకి నీరు సమృద్ధిగా చేరుతుండడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సన్మానం

గీసుకొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసిన ఉద్యోగ విరమణ పొందిన ఎస్.అశోక్‌రావును ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి, డీఐఓ, అధ్యాపకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన సభకు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అశోక్‌రావును అభినందించారు.

మండల పంచాయతీ కార్యాలయ ఆవరణలో...

ఉద్యోగ విరమణ సందర్భంగా ఎంపీఓ ఆడెపు ప్రభాకర్‌ను, శాయంపేట హవేలీ పంచాయతీ కార్యదర్శి రవీందర్ బాబును మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌ను డీపీఓ కటకం కల్పన, తదితరులు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం డీపీఓ కల్పన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, మండల స్పెషల్ ఆఫీసర్ సురేశ్, డీఎల్‌పీఓ వేదవతి, ఎంపీడీఓలు కృష్ణవేణి, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రతోనే నాయకులపై రౌడీషీట్

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య

నెక్కొండ : అధికార పార్టీ నాయకుల రాజకీయ కుట్రతోనే బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు రౌడీ షీట్ తెరిచారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులు అకారణంగా మండలంలోని తనపైనే కాకుండా చంద్రుగొండ గ్రామ శాఖ అధ్యక్షుడు సిరిపోతుల సురేశ్, బానోతు రవిపై కేసులు నమోదు చేశారని తెలిపారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఒత్తిడి వల్లే ఎస్సై మహేందర్ కేసులు బనాయించారని ఆరోపించారు. తమపై రౌడీషీట్ తెరవడం, కేసుల నమోదుపై పోలీసు శాఖ ఉన్నతాధికారులు విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అన్యాయంగా కేసులు బనాయించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు కొమ్ము రమేశ్ యాదవ్, గాదె భద్రయ్య, జాటోతు రమేశ్‌నాయక్, లావుడ్య హరికిషన్, కొణిజేటి భిక్షపతి, దాసరి శ్రీనివాస్, కారింగుల సురేశ్, దేవనబోయిన వీరభద్రయ్య, మాతంగి రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూరయ్య, తదితరులు